పోలీసులనుంచి
తప్పించుకుని
పారిపోయిన ఆదొంగ
చేసిన పనేమిటి?

# అటువేపు

ఇచ్ఛాపురపు
రామచంద్రం
కథ

అంతవరకూ మామూలుగానే నడుస్తున్న రాయుడు — సెల్ ముందుకి వచ్చేసరికి హఠాత్తుగా ఏదో గుర్తుకు వచ్చినట్లు ఒక్కసారిగా వెనక్కి తిరిగాడు. తనకి కాపలాగా వెంట వస్తున్న ముగ్గురు కాకీ మనుషులు. హెడ్... టు నాట్ టు... త్రీనాట్ ఫోర్...

"ఒక చిన్న మాట... మనవి..." గొణిగాడు రాయుడు.

"ఏమిటి?" యధాలాపంగా అడిగాడు హెడ్ కానిస్టేబుల్.

"ఒక అరగంట. మహా ఐతే ఓ గంటపాటు నన్ను వదిలిపెట్టండి" వినకూడని మాటవిన్నట్లు ఎర్రబుట్టలు మూడూ ఒక్కసారి తెల్లమొహంవేశాయి. తాను సరిగా విన్నాడోలేదో అని అనుమానమొచ్చింది కాబోలు హెడ్ రెట్టించాడు. "ఏమిటి?"

"ఏమీ లేదు. ఒక్క అరగంట నన్ను వెళ్లి రానిస్తే..."

వెర్రి మొహం వేసిన హెడ్ తేరుకుని... "ఏం రాయుడూ! నీ కంటికి మేమెలా కనిపిస్తున్నాం? సినిమా పోలీసుల్లాగో వెర్రి వెంగళప్పల్లాగో కనపడుతున్నామా?" గద్దించాడు.

"తమాషకాలు చేస్తున్నట్లుంది" వంత పాడాడు టునాట్ టు... టోపీ తడుముకుంటూ.

"లేదు లేదు" బతిమాలుతున్నట్లన్నాడు రాయుడు. "మీరు నాకూ నేను మీకూ కొత్తేమీ కాదు. నేను నెలనెలా వెయ్యి రూపాయలు స్టేషను మామూలు కట్టే పెద్ద దొంగవేకాని చిల్లర రకం కాను. అది



మీకూ తెలుసు. ఒక్క అరగంట నన్నొదిలారో...''

''కలికంలోకి కనిపించకుండా ఉడాయించేస్తావ్...'' అంతేనా అన్నట్లు నవ్వాడు హెడ్.

''అహా. నా పని చూసేసుకుని నా అంతట నేనే సెల్‌లోకి పోయి కూర్చుంటాను'' రాయుడి కంఠంనిండా ఎంతో విధేయ

తా... విశ్వాసమూ.

త్రీనాట్ ఫోర్ ఫక్కున నవ్వాడు. "పెద్ద మనిషి దొంగగారూ! జెంటిల్‌మన్ దొంగగారూ! ఇది — ఆవూ పులీ అమాయకపు కాలం కాదు. కలికాలం. ఘోరకలికాలం. కథల్చెప్పమాకు. నువ్వు పత్తికాలపు గోవువీ కావు. మేం మంచి పులీ కాము..." అంటూనే సెల్ తలుపు తీయబోయాడు.

"ఒక్కసారి... నన్ను నమ్మండి... నా మాట నమ్మండి. గంటకూడా అక్కర్లేదు. అరగంటలోగానే వచ్చేస్తాను. మీకు మాట రానివ్వను..." ప్రాధేయపడ్డాడు రాయుడు.

"దొంగని నమ్మడమా!" నవ్వాడు త్రీనాట్‌ఫోర్ హేళనగా.

"దొంగని పోలీసులూ... పోలీసులని దొంగలూకాక మరెవరిని నమ్ముతారు? మనల్ని మనమే నమ్ముకోకపోతే మామూలుగా మనుషులు నమ్ముతారా?" ఆశ్చర్యంగా చూశాడు రాయుడు. అతనిలో ఎలాగైనా ఒక్క అరగంటసేపు బయటకువెళ్లి రావాలనే తాపత్రయమూ, ఆత్రుతా.

"నువ్వెన్ని చెప్పు. నిన్ను పోనిచ్చేది లేదు" లాఠీఊపుతూ అధికారం ప్రదర్శిస్తూ...

"ఏనా ఇదెక్కడి వేళాకోళం? రిమాండ్ నుంచి వదలమనడం?" కోపగించాడు టూనాట్టూ.

"అదికాదు..." ఏదో చెప్పబోయాడు రాయుడు "చిన్నపని... చూసేసుకుని చిటికెలో వచ్చేస్తాను. నన్ను నమ్మండి..." ప్రాధేయపడ్డాడు.

"అసలింతకీ ఆ రాచకార్యమేమిటి?" అడిగాడు హెడ్ — అదోలా చూస్తూ.

రాయుడేదో చెప్పాలనుకుని చాలా ప్రయత్నించాడు. కాని... చెప్పలేకపోయాడు. ఏమీ చెప్పలేకపోయాడు. అతని నోటినుంచి ఒక్క ముక్కకూడా ఊడిపడలేదు. అతనికి సిగ్గేసింది. మొహమాటం ముంచేసింది. మూగవాడిలా తల వంచేసుకున్నాడు సిగ్గుపడిపోతూనే.

"ముందుకొట్టిరావాలా?" హేళనగా అడిగాడు త్రీనాట్‌ఫోర్.

పిల్లికి చెలగాటం... ఎలుక్కి ప్రాణసంకటం... పోలీసుకి చెలగాటం, దొంగకి ప్రాణసంకటం. రాయుడికి కోపమొచ్చింది. కానేం చేయగలడు?

"ముందకెళ్లిరావాలా?" టూనాట్టూ కిచకిచలాడాడు.

"అలాంటివైతే — ఎక్కడికో వెళ్లక్కర్లేదనీ, డబ్బులిస్తే ఇక్కడి... స్టేషన్‌లోనే అమరుతాయనీ నాకు తెలుసు. పోలీస్ స్టేషన్ నాకూ, స్టేషన్‌కి నేనూ కొత్తేమీ కాదు" చిరాకుగా అన్నాడు రాయుడు.

"మరేటంత ముఖ్యమైన అర్జంటెవహారం?" త్రీనాట్ ఫోర్ సూటిగా చూశాడు. రాయుడికి నోరు పెగలలేదు.

"మాటలేటి, తోసెయ్యక?" అంటూనే సెల్ తాళం తీశాడు టునాట్ టు. కసురుతూనే రాయుడిని లోపలికి తోసేశారు రక్షకభటులిద్దరూ... హెడ్ పర్యవేక్షణలో. తలుపుకి తాళమూ వేసేశారు. అప్పుడు "సెల్‌ముందు వరండాలోకి చేరారు ముగ్గురూ. స్థిమితంగా కూర్చున్నాక — హెడ్ మొదలుపెట్టాడు సిగరెట్ అంటించి తీరుబడిగా.


"మీరిద్దరూ కొత్తోళ్లు కనక చెబుతున్నా

ను. జాగర్తగా ఇనుకోండి. కొత్త ఎస్సైయ్'' గొంతు తగ్గించి ''కర్కోటకుడూ కాలాంతకుడూ, పొట్టి అగ్గిరాముడు. రిమాండ్‌లోంచెవరైనా దాటేశారో ఎస్సైయ్ మనుజ్జోగాలికె సరుపెట్టేస్తాడు. అంచేత జాగర్త...'' మళ్లీ గొంతు పెంచి... ''అందులోనూ ఈ దొంగ... సామాన్యుడు కాదు. పేరు కొండ్రాయుడు. మనిషి కండ్రాయుడు. కేడీ... దొంగ... తాగుబోతు... హంతకుడు. గుండెల్తీసిన బంటు... నరరూప రాక్షసుడు. పచ్చి రక్తం తాగే పిశాచం. మీరే చూస్తున్నారుగా? చెట్టంత మనిషి. చెయ్యెత్తు మనిషి. నల్ల శానపురాయే వాడి వళ్లు. రాతిబండే వాడి గుండె. మనిషికంటె ముందు కల్లు కంపు. పెళ్లీ, పిల్లలూ లేని ఒంటరి. ఆడోళ్ల పట్ల తుంటరి. అడిగినంత కల్లు అరువు పొయ్యలేదని ఆ వేళ కల్లు కొండమ్మ చెయ్యిరిచేశాడు పళుక్కువ. పిలవగానే పక్క పరిచి పక్కలోకి రాలేదని సాని సుమతికి కొప్పు కోసేశాడు. ఏం చిరెక్కిందో ఒకడికి కాలు తీసేశాడు. మరొకడికి చెయ్యి తీసేశాడు. ముక్కుపుడకూడిరాలేదని ఒకర్తి ముక్కు కోసేశాడు. చెవికమ్మలు రాలేదని చెవులుకోసేసేడింకొకర్తికి. గండరగండడు. చిక్కడు దొరకడు. మీరిద్దరూ స్టేషనుకి కొత్తని చెబుతున్నాను'' అవకాశమూ, తీరగా వినడానికి మనుషులూ దొరికారని మహోత్సాహంతో స్పీచిచ్చేశాడు హెడ్‌కానిస్టేబులు. ఐతే...

సెల్ లోపల... ద్వారం వద్దే ఉన్న రాయుడు గట్టిగానూ వాళ్లకి వినపడేటట్లు ''హెడ్! మీరు చెప్పిన వాటిలో చాలా మేరకు నిజమే నా గురించి. కాని... నాకు దొంగతనమే తప్ప దగుల్బాజీ తనం తెలీదు. మర్డర్లే తప్ప మాయమర్మాలు తెలీవు. నన్ను నమ్మండి. ఒక్కసారొదలండి. తిరిగి వచ్చి ఇక్కడ కూర్చోకపోతే ఒట్టు. నా అంతట నేనే సెల్లోకి వచ్చేస్తాను అరగంటలో'' అన్నాడు రాయుడు.

వాళ్లు అతన్ని వినిపించుకోవట్లే వుండిపో

## చెట్టుకింద కోర్టు



'చెట్టుకింద ప్లీడర్' — అనేది ఎంతో సాధారణమైన విషయం! అయితే ఇప్పుడు చెట్టుకింద జడ్జిగారు కూర్చుంటున్నారంటే నమ్మగలరా? మీరు నమ్మినా... నమ్మకపోయినా ఇది నిజంగా నిజం! పశ్చిమ బెంగాల్‌లోని ఆలీపోర్ మేజిస్ట్రేట్ ఆఫీస్ భవనం ఎప్పుడైనా పడిపోవచ్చునని 'పబ్లిక్ వర్క్స్' విభాగం చెప్పగానే... 'జడ్జిగారు ప్రాణాలు కాపాడుకుంటే మంచిదనే' ఉద్దేశ్యంతో తన కోర్టు వాతావరణాన్ని చెట్టుకిందకు మార్చారట! నిజమేకదా! బతికుంటే ఏదో... ఒకటి చేసుకోవచ్చునని ప్రముఖుల అభిప్రాయం! అదే నిజమైంది ఈ జడ్జిగారి విషయంలోకూడా! — జూపిటర్

యారు.

"ఇవాలయినా నేను నిజంగా దొరకలేదు జవాన్లకి. సారా శాంతమ్మలో వుంటే — మీ జవానొచ్చి నీతో అర్జంటు పనిపడిందీ, ఒక్కసారి స్టేషనుకొచ్చి కనిపించిపో... కొత్త ఎస్సయ్ వొచ్చాడూ — అని బతిమాలాడు. తాగుతున్న సారా సగంలో ఆపి మరీ వచ్చాను. ఎందుకని? మనిషిని నమ్మాలి కనక. తీరా నేను స్టేషనులో అడుగుపెట్టాక — మోసం, దగా, కుట్ర అన్నీ పన్నేశారు నామీద. నన్నవమానించేరు. ఎఫ్పయ్యారు రాసేశేరు. స్టేషనుకి నీతీ పోలీసులకి నిజాయితీ వుండవని ముఖంమీద చెబుతున్నట్లు నమ్మించి ద్రోహం చేశారు. నిజంగా నేనందుకూ బాధపడ్డమే లేదు. ఎఫ్పయ్యారంటే కేసు. కేసంటే కోర్టు. కోర్టంటే శిక్ష. శిక్షంటే జైలు. రెణ్నెల్లో, మూణ్నెల్లో జైలుశిక్ష. అంతేకద? జెయిలు నాకు కొత్తేం కాదు. నా బాధ కేసు బనాయించారనీ, జెయిలుకి పంపేస్తున్నారనీ కాదు. నమ్మించి ద్రోహం చేశారే అని. మనమూ మనమూ ఒకలా వుండవలసినవాళ్లం. మనిషిమీద మనిషికి నమ్మకం వుండకపోతే ఎలా? ఒక్కసారి నన్ను బయటకెళ్లిరానివ్వండి. మీకు చేతులెత్తి దణ్ణం పెడతాను"

"నోరు మూసుకుని పడుకో. బొక్కలో పడ్డా బీరాలు మానవు" కసిరాడు టూనాట్నూ. హెడ్ మళ్లీ తన కథనం కొనసాగించాడు. "సాయంత్రం బస్టాండులో పొట్టలో పదివేలున్న క్యాష్ బ్యాగ్ గల్లంతయింది. పోగొట్టుకున్నవాడు అల్లాటప్పాగాడూ ఆషామాషీ మనిషీ కాదు. సాక్షాత్తూ ఐజీగారి వేలువిడిచిన మేనత్త అల్లుడి తమ్ముడి బావమరిది కొడుకు. కనక సొమ్మును దొంగనీ కూడా పట్టుకోవలసిన అనివార్య పరిస్థితి ఎదురైంది స్టేషనుకి. సొమ్మయితే నిమిషంలో అడ్జస్టుమెంటు చేసేశారుకాని అతగాడు దొంగమీద కేసు పెట్టి తీరాలని పట్టుపట్టేశాడు. ఉడుం పట్టు పట్టేశాడు. ఎస్సయ్ కొత్తాడు. కొత్త బిచ్చగాడు పొద్దెరగడని తెలిసిందేకదా?" చివరి మాటలు మెల్లగా అని... మళ్లీ గొంతు పెంచాడు హెడ్. "గొర్రెల గోత్రాలు గొల్లలకెరుకో కాదో కాని కేడీల జాతకాలు కానిస్టేబుల్స్‌కి కరతలామలకాలే కద? పోలీస్ స్టేషనుకే ప్రిస్టేజి కొశ్చనయింది వ్యవహారం. పోలీసులు తలుచుకున్నారు. దొంగని పట్టేశారు అరగంటలో..." గర్వంగా చెప్పాడు హెడ్.

భరించలేకపోయాడు రాయుడు. "నేనా దొంగతనం చెయ్యలేదు. నన్ను పోలీసులూ పట్టుకోలేదు. బానంత పొట్ట తప్ప పిట్టలో వుండే ఆ ఫైవ్‌నాట్‌టూ నన్ను పట్టుకోడమా! కష్టాలెవరికేనా వొస్తాయని కనికరించి కానిస్టేబులు వెనుక కదిలొచ్చాను. నన్నిలా దగా చేశారు. ఐనా నేనేమీ బాధపడడంలేదందుకు. నా బాధంతా మీరు నన్ను నమ్మడంలేదనే. దొంగల కష్టాలు దొంగలవీ, పోలీసుల బాధలు పోలీసులవీ అని నాకు తెలుసు. నేను దొంగనేకాని దగుల్బాజీని కాను. ఇప్పటికేనా మించిపోయింది లేదు. ఒక్కసారి... ఒక్క అరగంట నన్నొదలండి. మళ్లీ నా అంతట నేనే వచ్చేసి కొట్లో కూర్చోకపోతే నన్నడగండి. చెప్పిచ్చుకు కొట్టండి. దయచేసి నన్నొక్కసారి వొదలండి.జరిగినదంతా మరచిపోతాను. మనసులో పెట్టుకోకుండా మరచిపోతాను. 'మనమూ మన


మూ ఒకటిగా వుందాం" ప్రాధేయపడ్డాడు దీనంగా.

"నోరు మూసుకునుండు చెవికోసిన మేకలా గోలచెయ్యక" కసిరాడు హెడ్.

"దొంగ పోలీసులని నమ్మాలికాని పోలీసులు దొంగలని నమ్మేస్తే యమ డేంజర్" కిచకిచలాడాడు టూనాట్టూ. ఔనన్నట్లు తందాన తాన పాడుతున్నట్టు తలూపాడు త్రీనాట్‌ఫోర్.

అవతల అంత రాచకార్యమేమిటి రాయుడికని ఒకపక్క ఆలోచిస్తూనే — కానిస్టేబుల్స్‌కి జాగ్రత్త చెప్పాడు హెడ్. "బి కేర్‌ఫుల్... వీడు నీటిలో నీడలు వెదగ్గలడు. గాలిలో జాడలు తియ్యగలడు. తప్పించుకున్నాడో మన తలకొస్తుంది. ఉజ్జోగాలు మిగిలుండాలంటే ఏమాత్రమూ ఉపేక్షించకుండా కాపలా కాయండి రేపు కోర్టుకప్పగించేవరకూ" అనేసి వెళ్లిపోయాడతను సెల్ తాళం మరోసారి చూసి. అతను వెళ్లిపోతుంటే ఇద్దరు కానిస్టేబుళ్ళూ మెల్లగా పాటలు ఎత్తుకున్నారు. "మందుకి వేళాయెరా...", "మగువకి వేళాయెరా..."

ఇక ఆశ మిగలనట్లు రాయుడు సెల్ ఊచలు వదిలి లోపలికి నడిచాడు విధిలేనట్లు సెల్... ఇరుకుగా... చీకటిగా... చిత్తడిగా... కంపుగా... ఉక్కగా... దోమలుగా — పరమ అసహ్యంగానూ వుంది. మరోలా వుంటుందని రాయుడూ ఆశించలేదు. అతనికి పోలీసులు తనని నమ్మనందుకు కంటే — ఒక్కసారి బయటకు వెళ్లిరాలేకపోతున్నానే అన్న బాధ తీవ్రాతితీవ్రంగా వుంది. దానితో మహా చికాకుగానూ, అవమానంగానూ, కోపంగానూ వుంది. సెల్ ముందు వరండాలో — టూనాట్ టు త్రీనాట్ ఫోర్‌లు టీలు తాగుతూ... బీడీలు కాలుస్తూ కబుర్లలో పడ్డారు. సారాకొట్లు... సానికొంపలు... సినిమాలు... కొత్తెప్పయ్... రాజకీయాలు... సెక్సు... ఆర్థిక బాధలు... అధికారుల పోర్లు... ఎన్నెన్నో దొర్లి దొర్లి అర్ధరాత్రి దాటేసరికి ఐపోయాయి. వాళ్ల



కళ్లమీదకు నిద్రా, వంటిమీదకు అలసటా వచ్చేశాయి. సెల్‌లో రాయుడు అసహనంగానూ, అస్తిమితంగానూ, ఆత్రంగానూ అవకాశంకోసం ఎదురుచూస్తున్నట్లుగానూ అటూ ఇటూ ఆ మూలకీ ఈ మూలకీ కలయదిరగేస్తున్నాడు. కొత్తగానూ మొదటిసారి బోనులో పెట్టబడిన అడవి మృగంలా ఆందోళనా అలజడీ ఆదుర్దా పడిపోతున్నాడు. పోలీసులకి లంచమిస్తానన్నా ఒక్క అరగంట విడుదల చేయకపోవడం అతనికి వారిపట్ల విపరీతమైన కోపమూ విసుగూ తెప్పించి వదిలిపెట్టాయి. అతని తక్షణావసరమూ... ప్రగాఢ వాంఛా — స్వేచ్ఛ! ఒక్క అరగంటపాటు స్వేచ్ఛ! ఆ బందిఖానానుంచి. అదే అంది రావడంలేదు. ఎంత బతిమాలినా ఎంత డబ్బు ఇస్తానన్నా. తన మాటలు కథలుగా కొట్టిపారేశారు పైగా! కాలం గడుస్తోంది. ఠాణాలో — ఠంగు ఠంగున వరుసగా ఐదు గంటలు. కాపలా పోలీసులు కళ్లు తెరిచారు. ఎదురుగా ఖాళీ సెల్! వెక్కిరిస్తున్నట్లు... వేళాకోళం చేస్తున్నట్లు. బతుకులని భయపెడుతున్నట్లు, ఉద్యోగాలను ఉరితీస్తానన్నట్లు. కెవ్వున కేక వేశారు కానిస్టేబుల్స్ ఇద్దరూ ఒకేసారి. ఆ ఒక్క కేకకూ స్టేషన్ యావత్తూ త్రుళ్లిపడి లేచింది. క్షణంలో గుప్పున వ్యాపించింది — రాయుడు సెల్‌లోంచి తప్పించుకున్నాడన్న సంచలనవార్త — పొగలా.

కొత్త ఎస్సయ్‌గారికి వచ్చే కోపం... స్టేషన్ ప్రిస్టేజి ... పోలీసులకిన్సల్ట్...

తుపాకులు పట్టుకుని... సైకిళ్లెక్కి... పదిమంది రక్షక భటులు... పది దిక్కులకీ... పరుగుపరుగున బస్టాండ్‌వేపు... రైలుస్టేషన్‌వేపు... ఊరివేపు... వాడవేపు... ఎర్రగా పరుగెడుతున్నాయి టోపీలు.

సూర్యోదయం కాబోతోంది. పోలీసు టోపీల్లా ఎర్రగా.

ఆ వీధి మొగదల... అప్పటికే లేచి... రాళ్లు కొడుతున్నాడు రాములు. రెక్కాడినా డొక్కాడని రాతి బతుకు. పొద్దుటేనుంచి పొద్దోయేవరకూ ఎంత పాటుపడినా సాపాటు దొరకని శ్రమజీవి. వాడి ముందు రాతిబండలు జీవితపు సమస్యలలాగా. టువాట్టో త్రీనాట్‌ఫోర్‌లు వాడిపక్కనే ఆగారు. సరిగ్గా అదే క్షణంలో రాములు సమ్మెటెత్తి... ఆ రాతిమీద బలంగా దెబ్బవేశాడు — సత్తువంతా పూని. రాయి రెండుగా విడి ఫెళ్లున విరిగి... ఒక చిన్న కప్పపిల్ల... ఛంగున టూనాట్‌టు బూటుమీదుగా అతనిమీదకి గెంతేసరికి అతను త్రుళ్లిపడుతూనూ... దాన్ని తప్పించుకుంటూనూ... అత్యంతాశ్చర్యంగానూ అరిచాడు. ''అరె! కప్పపిల్ల! రాతిలో... బండరాతిలో కప్పపిల్ల! రాతిలోపలికెలా దూరి వెళ్లిందో! ఎలా బతికిందో!''

దృష్టి మరల్చకుండానే... పని ఆపకుండానే... తనకి తెలిసిన విషయాన్ని చెప్పకుండా వుండలేని బలహీనతలో... వినేవాడు దొరికాడనేసరికి వాగాలనే మానవ బలహీనతలో... మళ్లీ అవకాశం రాదేమో అన్నట్లు...

''ఎంత బండరాతిలోనూ అంతో ఇంతో తేమ వుంటూనే వుంటుంది. ఆ తడిలోనే పుట్టి దానిలోనే బతుకుతుంది కప్పపిల్ల. అంతేకాని రాతిలోకి దూరడం కాదు. ఆ తేమచాలు అది పుట్టడానికి బతికి బట్టకట్టడానికి'' అన్నాడు రాములు రాతిమీద సమ్మెట వేస్తూ.

త్రీనాట్ ఫోర్ విసుక్కున్నాడు. "వేదాంతానికేంగాని, రాయుడెక్కడో చెప్పు. నీ నేస్తమటగా? సారా శాంతమ్మ కొంపలో లేదు. చూసే వస్తున్నాం" లాఠీని రాతిమీద కొడుతూ... పోలీసు జులుం ప్రదర్శిస్తూ అడిగాడు కఠినంగా. అప్పుడు తల తిప్పి అటు చూశాడు రాతి రాముడు.

ఎర్రటోపీలు... లాఠీలు... పోలీసులు! ఒక్కసారి కంగారూ భయమూ పడిపోయి.. . "బండరాయుడా? ఈ రోడ్డంట లోపలికంటా వెళ్లి... ఎండం చేతివేపు తిరిగితే నాలుగో ఇల్లు... ఒంటిగది ఇల్లు..."

ఆ వివరం వినడమేమిటి పోలీసులిద్దరూ అటు దూసుకుపోయారు వేగంగానూ సైకిళ్లమీదా.

అప్పుడు నాలిక కరుచుకున్నాడు రాముడు. తెగ ఇదయిపోయాడు చేయకూడదని చేటూ, ఎంతో పెద్ద తప్పు చేసినట్లు. పోలీసులని హఠాత్తుగా చూసిన కంగారులోనూ భయంలోనూ నోరు జారేసి రాయుడి ఆచూకీ చెప్పేశాడు తను. రాయుడికి ద్రోహం చేసేడు. తననెంతో నమ్మిన నేస్తానికి అన్యాయం చేసేశాడు చేతులారా! ఇప్పుడెలా?

రాములికేడుపొచ్చేసింది. ఏడుస్తూంటే ఏదో గుర్తొచ్చింది. రొంటి తడుముకున్నాడు. చిన్న గుడ్డ సంచి తీశాడు. దానిలో పది వంద రూపాయల నోట్లు — కొత్తవి... పెళపెళలాడుతూ. ఒక్కసారి చూసుకుని మళ్లీ సంచిలో పెట్టి సంచిని రొంటిలో పెట్టేశాడు. రాయుడూ! నువ్వు నన్ను నమ్మి ఎయ్యిరూపాయలిచ్చావు. వేవేమో నీ ఆచూకీ పోలీసులకి చెప్పేసివెర్రి ఎదవనైపోయి.

"పెళ్లాం బిడ్డలు లేనోడికి పచ్చి కేడీకి ఇల్లుకూడా ఏంటో?" వీధిముందు సైకిలు దిగి నడుస్తూ అడిగాడు త్రీనాట్ ఫోర్.

"ఎదవముండకేనా ఏవిళ్ల తప్పవని మనిషన్నాక ఎక్కడో చోటుండాలిగా? సొంతిల్లయి వుండదు. అద్దె కొంపయ్యుంటుంది.

## సినిమా

అత్తారింటికి వెళ్లినసుబ్బారావుని బామ్మర్ది సినిమాకి తీసుకువెళ్లమని పేచీ పెట్టాడు.

సుబ్బారావు మూడు టిక్కెట్లు తెచ్చాడు. అది చూసిన భార్య 'మూడు టిక్కెట్లు దేనికి తెచ్చారు' అనడిగింది.

"మీ నాన్నకి, మీ అమ్మకి, మీ తమ్ముడికి. మనం హాయిగా ఇంట్లో వుందాం" చెప్పాడు సుబ్బారావు.

— కె.వి.మధుసూదనరావు (కాకినాడ)



దొంగల్లికేడవబయుంలాగే దొంగగాడికి పర్మనెంట్రెడెసు బయుం''

''ఔనూ... మందుకీ కాక ముండకీకాక రాయుడెందుకు తప్పించుకుపారిపోయాడంటావ్? జైలంటేమా భయంలేదుకదా?''

''ఏమో, పుర్రెకో బుద్ధి, జిహ్వకో ఆనందం అన్నారు. వాడి మనసులో ఏ పురుగుందో? చూడు... అదుగో... ఆ ఇల్లేలా వుంది... ఆనవాళ్ళు అన్నీ సరిపోయాయి... అదే... జాగర్త... నువ్వు ముందు కాయి. నేను వెనక కాస్తాను. జారిపోనివ్వకు సుమా! వాడసలే రాయుడుగాడూ, తప్పించుకున్న కేడీ''

పేరుకిల్లుకానీ నిజానికది ఒంటిగదే. గదికి రెండువేపులా రెండు ద్వారాలు, రెండుకిటికీలూ... ఒకడు ముందు కిటికీవేపూ రెండో పోలీసు వెనక కిటికీవేపూ చేరారు. గదిలో చీకటిగానే వుంది. బయట సూర్యుడు ఇంకా పూర్తిగా వెలుగు పోసుకోకపోవడాన లోపలినుంచి మాటలు వినిపిస్తున్నట్టవుతుంటే వీళ్ళిద్దరూ చెవులు రిక్కించుకుని వినసాగారు కిటికీ ఆనుకుని.

''రాత్రంతా నిన్నాకలితో వుంచేశానని బాధపడుతున్నాను. ఎంతాకలిగా వుందో నీకు! తాగు... ఊ... తాగాలి మరి... తాగు... మళ్ళీ ఎన్నాళ్ళకి నా చేతుల్తో తాపించగలుగుతానో? తాగాలి మరి... అరె! ఎందుకలా ముఖం తిప్పేసుకుంటావ్? మూతి ముడుచుకుంటావ్? అయ్యో! నీ కళ్ళలో నీళ్ళు! ఓ. కన్నా! చిన్నా! నిజం నీకు తెలిసిపోయిందన్నమాట! అందుకే నీకు నా మీద కోపమొచ్చింది. అందుకే నా వేపలా అసహ్యంగా చూస్తున్నావ్... ఔనా? నేనో దొంగనని తెలిసి... ఇన్ని రోజులుగా ఈ సంగతి నీనుంచి దాచానని... కోపం. అంతేకదూ? దొరక్క దొరక్క వరంలా దొరికావు నువ్వు. నా ప్రాణానికి ప్రాణానివి. నీ దగ్గర నాకు రహస్యమూ గోప్యమూనా! ఊహూ... అవసరం రాలేదని... అవకాశం రాలేదని... అంతే తప్ప నీ దగ్గర నిజం దాచాలని కాదు. అబద్ధమాడాలని కాదు. విను మరి... నేను నా కథ చెబుతుంటాను. మనసుపెట్టి వింటూ... నా కథ వింటూ తాగు ఏం?

నా చిన్నప్పుడే నాన్న చచ్చిపోయాడు. అమ్మకూడా చచ్చిపోయి అనాధనయ్యాను. పొట్టలో ఆకలేతప్ప అచ్చరమ్ముక్క లేదు. మంచి చెడు చెప్పే మనిషి లేని ఒంటరిని. నిలవనివ్వని ఆకలి తీర్చుకుందుకు... నిప్పులా దహించే ఆకలి చల్లార్చుకుందుకు అయినదా కానిదా అని చూడకుండా దొంగతనంలోకి దిగిపోయాను. నాకంతకంటె చేతనైందీ సులువైనదీ మరో తోవ కనిపిస్తేకదా? నిజం చెప్పాలంటే నేను నమ్మినవృత్తి నాకన్యాయం చెయ్యలేదు. ఒక్రెండుసార్లు దొరికిపోయి జెయిలుకెళ్తేనేం, నా బతుకు బాగానే సాగుతూ వచ్చింది. సుఖంగానే జరిగింది. తాగడం ఆపెయ్యకు... ఊ... అది అలాగ... ఇవాళ నేను దొరక్కపోయినా స్టేషనుకి రమ్మంటే వెళ్ళాను. వాళ్ళు కేసుపెట్టారు. దానికేంలే. వాళ్ళకీ మాకూ అవి మామూలే. దొరకనంతసేపూ దొర, దొరికాడో దొంగే. దొంగ జైల్లో వుండాలి. కనుక నేనూ జెయిలుకెళ్ళాలి. అది నా సిద్ధాంతం. మరి ఇలా ఎలా వొచ్చాననా అలా ఆశ్చర్యంగా చూస్తావు? రాక ఎలా? జెయిలులాంటి స్టేషనునీ... సెల్‌నీ• చూసేసరికి నిన్ను

గదిలోపెట్టి తాళం వేసుకువెళ్లిన సంగతి జ్ఞాపకం వచ్చింది. నిన్నెవరికేనా అప్పజెప్పాలి. నాకేమయిందో నీకు చెప్పి వెళ్లాలి. లేకపోతే నువ్వు నాకోసం నేను నీకోసం బెంగతో చచ్చిపోమూ? అందుకని సెల్ నుంచి తప్పించుకొచ్చాను. కాపలా కానిస్టేబుల్స్ని ఏమార్చా. తప్పేకానీ... తప్పదుకదా? జడ్జిగారు చల్లగా చూస్తే మరీ ఎక్కువ శిక్ష పడదు. తొందరగానే తిరిగొచ్చేస్తాను. మళ్లీ మనం కలిసి వుండొచ్చు హాయిగా. రాళ్లు కొట్టే రాములన్నకి వెయ్యి రూపాయలిచ్చాను. నేనొచ్చేవరకు నీ ఆలనా పాలనా చూడమని. నేను జెయిల్లో వున్నా నిన్నప్పుడప్పుడు నా దగ్గరకు తెచ్చి చూపిస్తాడులే. అదుగో! మళ్లీ ఏడుస్తున్నావ్! నువ్వు ఏడుస్తుంటే నేనెలా వెళ్లగలను? అడుగు పడొద్దూ? నేను తొందరగా వెళ్లకపోతే కాపలా పోలీసులు కంగారుపడతారు. స్టేషను గందరగోళమౌతుంది. వాళ్లద్యోగాలకి ముప్పొస్తుంది. అది మంచిది కాదుకదా? మనం బతకాలి. మరొకరిని బతనివ్వాలి. ఇంకొకరి ఉసురుపోసుకోడం న్యాయంకాదు. ధర్మంకాదు. నువ్వు సంతోషంగా సాగనంపితేనే వెళ్లగలను. నిన్నొదిలి వెళ్లడం నాకూ బాధగానే వుంది. ఆ... ఇదీ ఒకందుకు మంచిదే అయింది. ఓ కొత్త విషయం తెలిసింది. ఇక మీదట నిన్నిలా వొదిలి వెళ్లవలసిన పరిస్థితి రానివ్వను. జెయిలునుంచి వచ్చేశాక మరి దొంగతనం చెయ్యను. ఏదో పని నేర్చుకుని నీ పొట్టా, నా పొట్టా పోషిస్తాను. అలా ఐతే మనం కలిసే వుండొచ్చు. ఏమిటలా అపనమ్మకంగా చూస్తావ్? నా మాట నమ్మలేకపోతున్నావా? నిజంగా... ఒట్టు... నీ మీదొట్టు... ఇక దొంగతనం చెయ్యను. జైలుకెళ్లను. నా మాట నమ్ము... అదీ! అలా నవ్వాలి. ఒక్క ముద్దిచ్చెయ్... ఊ... మరి వెళ్తానేం? టాటా! కాస్సేపట్లో రాములొచ్చి నిన్ను తీసుకెళ్తాడు. వాడిదగ్గర బుద్ధిగా కుదురుగా వుండేం? నేను వెళ్తున్నానూ...'' సంతోషంగా తోకూపుతూ... కుంయి కుంయిమంటూ ద్వారంవరకూ సాగనంపిందతన్ని చిన్న కుక్కపిల్ల.

ద్వారం దాటడమేమిటి, మెరుపులా పరుగెత్తి ... టూనాట్ టు, త్రీనాట్ ఫోర్ లకు అందకుండా... శరవేగంతో స్టేషన్ చేరుకుని... సెల్ లోకి పోయి... తలుపులని తానే బిగించుకుని... విశ్రాంతిగా నేలమీద చతికిలపడుతున్న రాయుడిని —
వింతగా విచిత్రంగా నమ్మలేనట్లు చూస్తూ చేష్టలుడిగి మిగిలిపోయారు స్టేషన్ స్టాఫ్. ఎక్కడో దూరంగా... చిన్న కుక్కపిల్ల... ఇంకా కుంయి కుంయిమంటూనేవుంది.

◇ ◆ ◇

